సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 27 । మార్చి । 2023



వేసవి నుంచి ఉపశమనం..
ప్రయాణికులు, సిబ్బందికి వేసవితాపం నుంచి ఉపశమనం కల్పించేందుకు ఆర్టీసీ యాజమాన్యం చర్యలు చేపడుతోంది. 8లో



కొత్త రాజకీయం కావాలి
కొత్తగూడెం నియోజకవర్గానికి కొత్త సూర్యోదయం, కొత్త రాజకీయాలు కావాలని రాష్ట్ర డీహెచ్ గడల శ్రీనివాసరావు అన్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
36° / 23°
జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు గరిష్టంగానే నమోదవుతాయి. ఉదయం నుంచి గంటగంటకూ వేడి పెరుగుతూ ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమవారం సా) 6.27
సహర్ (మంగళవారం ఉ) 4.44

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్ : శ్రీదేవీ వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారికి అర్చకులు ఆదివారం విశేష పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని తలనీలాలు, ఒడిబియ్యం, చీరలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీచక్రార్చన, లక్ష మల్లికా కుసుమార్చన, నీరాజన మంత్రపుష్పం, అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీరామనవమికి చిన్నజీయర్ స్వామి

భద్రాచలం: ఈనెల 30న భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి చిన్నజీయర్ స్వామి హాజరవుతారని స్థానిక జీయర్ మఠం నిర్వాహకులు తెలిపారు. ఈనెల 29న సాయంత్రం జీయర్ మఠానికి చేరుకుంటారని, 30న స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని అదే రోజు తిరిగి వెళతారని పేర్కొన్నారు. 31న జరిగే పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు అహోబిల జీయర్ స్వామి, దేవనాథ జీయర్ స్వామివార్లు 30న జీయర్ మఠానికి చేరుకుంటారని వెల్లడించారు. కాగా, మఠంలో సోమవారం సాయంత్రం గరుడ ధ్వజపట ఆవిష్కరణ ఉత్సవం, తీర్థప్రసాద వినియోగం ఉంటాయని, జీయర్ మఠం అనుబంధ సంస్థలైన వికాస తరంగిణి, శ్రీమత్ రామానుజ సేవాసమితి బాధ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

'బెక్కంటి'కి నంది అవార్డు



శ్రీనివాసరావుకు బంగారు కంకణాన్ని అందజేస్తున్న రాకేష్ శ్యామ్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయుడు బెక్కంటి శ్రీనివాసరావు నంది అవార్డు అందుకున్నారు. మంచిర్యాలలో ఆదివారం జరిగిన జాతీయ కూచిపూడి ఉత్సవాల్లో బెక్కంటికి జాతీయ నృత్య కళాకారుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత వేదాంతం రాకేష్ శ్యామ్ నంది అవార్డుతో పాటు బంగారు కంకణాన్ని అందజేయగా, నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

లక్ష్యం దిశగా చదువులు సాగించాలి



మాట్లాడుతున్న అనసూర్య

చర్ల: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకుని సాధన దిశగా చదువులు సాగించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డి.అనసూర్య అన్నారు. స్థానిక లక్ష్మీకాలనీలో ఎస్సీ బాలుర హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాయాలని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించాలని అన్నారు. అనంతరం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, జామెట్రీ బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు శివ, భాస్కర్, సీహెచ్.లక్ష్మణరావు, వసతి గృహ సంక్షేమాధికారులు జి. శ్రీనివాసరావు, కె.అంజిబాబు, మల్లికార్జునరావు, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

లక్ష్యం.. 100%



కొత్తగూడెంలో ప్రీ ఫైనల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఉన్నతాధికారుల పర్యవేక్షణలో..

కలెక్టర్ అనుదీప్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు ఆదేశానుసారం జెడ్పీ హైస్కూళ్లను డీఈఓ సోమశేఖరశర్మ, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలలను ఐటీడీఏ డీడీ రమాదేవి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆయా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలల్లో ఐటీడీఏ పీఓ సూచనల మేరకు 60 రోజుల ప్రత్యేక కార్యక్రమం పూర్తి చేశారు.

ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు

- జిల్లాలో హాజరు కానున్న 12,490 మంది విద్యార్థులు
- ఏర్పాట్లలో నిమగ్నమైన విద్యాశాఖ అధికారులు
- ఐదు నిమిషాల నిబంధన అమలులో..?

కొత్తగూడెంఅర్బన్/ఇల్లెందు : వచ్చేనెల 3 నుంచి 13 వరకు నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో గత సంవత్సరం 86.83 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణతతో పాటు 10/10 జీపీఏ సాధించాలనే లక్ష్యంతో ఉన్నారు. ప్రీఫైనల్ పరీక్షల్లో వచ్చిన మార్కులను బట్టి వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక కసరత్తు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 334 ఉన్నత పాఠశాలలకు చెందిన 12,490 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. గత ఏడాది 70 శాతం సిలబస్‌తో పరీక్షలు జరగగా, ఈ సంవత్సరం 100 శాతం సిలబస్, ఆరు పేపర్లతోనే ఉంటాయి. 100 శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. జనవరిలోనే సిలబస్ పూర్తి చేసి, ఆ తర్వాత రివిజన్ చేయిస్తున్నారు.

ఐదు నిమిషాలు ఆలస్యమైతే వెనక్కే ..

పదో తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 72 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 72 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. డీఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు పరీక్షలు జరుగుతాయి. అయితే ఈ ఏడాది కూడా 5 నిమిషాల నిబంధన అమలు చేస్తున్నారు. ఉదయం 9.35 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, ఆ తర్వాత వస్తే వెనక్కు పంపిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. సెంటర్ల వద్దకు ముందుగానే చేరుకుని రూం నంబర్లు చూసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచిస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సదుపాయాల కల్పనపై ఇప్పటికే ఎంఈఓలకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రశ్న పత్రాలు ఓపెన్ చేసే గదుల్లో సీసీ కెమెరాలు, తాగు నీరు, విద్యుత్ వంటి వసతులను పరిశీలిస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన సాగింది. ప్రతి విద్యార్థి 10 జీపీఏ సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.
– సోమశేఖరశర్మ, డీఈఓ

మెటీరియల్ ముందే అందించాం



ఐటీడీఏ పరిధిలోని విద్యాలయాల్లో ఈసారి నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పీఓ ఆదేశాల మేరకు అడ్వాన్స్ మెటీరియల్ అందజేశాం. 60 రోజుల ప్రణాళిక అమలు చేశాం. విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించి బోధన అందించాం. వారిపై నిరంతర పర్యవేక్షణ సాగుతోంది.
– రమాదేవి, ఐటీడీఏ డీడీ

ఒత్తిడికి గురి కావొద్దు



పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. భయాందోళన, కంగారును వదిలేయాలి. పరీక్ష సమయానికి ముందే కేంద్రాల వద్దకు చేరుకోవాలి. ప్రశ్నలను సక్రమంగా అర్థం చేసుకుని జవాబులు రాయాలి.
– డాక్టర్ రవిబాబు, డీసీహెచ్‌ఎస్

నేడు గరుడాధివాసం



ముత్తంగి కవచాలను ఈఓ రమాదేవికి అందజేస్తున్న దాతలు

- రామాలయంలో వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- భారీగా గోటి తలంబ్రాలు, బియ్యం వితరణ
- నేటి ముత్తంగి అలంకరణకు కవచాలు అందజేత

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో సోమవారం గరుడాధివాసం వేడుకను నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, సార్వభౌమ వాహన సేవలు ఉంటాయి. కాగా, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా యాగశాలలో శ్రీరామాయణ క్రతువు వైభవోపేతంగా కొనసాగుతోంది. అర్చకులు, రుత్విక్‌లు చతుర్వేద, రామాయణ హవనాలు, నిత్య పూర్ణాహుతి గావిస్తున్నారు. వేదిక వద్ద రామాయణ ప్రవచనం అనంతరం తీర్థ, ప్రసాద వినియోగాలు చేస్తున్నారు.

వితరణల వెల్లువ..

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ప్రతి సోమవారం ముత్తంగి అలంకరణ చేయడం ఆనవాయితీ. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన సంతోష్‌రెడ్డి దంపతులు రూ.30 లక్షలతో నూతనంగా కవచాలు తయారు చేయించి, ఆలయ ఈఓ రమాదేవికి ఆదివారం అందజేశారు. ఇక మణుగూరుకు చెందిన సుబ్బారావు శ్రీరామనవమి సందర్భంగా భక్తులకు అన్నదానం కోసం 50 క్వింటాళ్ల బియ్యాన్ని సమర్పించారు. అలాగే ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ గ్రామానికి చెందిన కళ్యాణం అప్పారావు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ చైతన్య సంఘం ద్వారా గోటి తలంబ్రాలు అందించారు. తొలుత అంబసత్రంలో ప్రత్యేక పూజలు, భద్రగిరి ప్రదక్షిణ అనంతరం వీటిని స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. ఈ తలంబ్రాల కోసం కొంత పొలంలో ప్రత్యేకంగా వరి సాగు చేశామని, 4వేల మంది భక్తులు గోటితో వలిచారని తెలిపారు. మొత్తం ఆరు క్వింటాళ్ల బియ్యానికి గాను భద్రాద్రి రామయ్యకు మూడు క్వింటాళ్లు, ఏపీలోని ఒంటిమిట్ట రామచంద్రస్వామి వారి ఆలయానికి మరో మూడు క్వింటాళ్లు అందిస్తామని వెల్లడించారు. పవిత్ర వేడుకగా భావిస్తున్న ఈ కార్యక్రమాన్ని గత 12 సంవత్సరాలుగా చేస్తున్నామని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, సీసీ అనిల్, ఆలయ పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బియ్యం అందజేస్తున్న మణుగూరు భక్తులు



గోటి తలంబ్రాలు తీసుకొచ్చిన కోరుకొండ బృందం

మళ్లీ కరోనా ఛాయలు

ఆర్టీసీ ఉద్యోగి ఒకరికి పాజిటివ్

చుంచుపల్లి: ప్రజలను రెండేళ్లపాటు తీవ్ర భయభ్రాంతులకు గురిచేసిన కరోనా మహమ్మారి ఛాయలు మళ్లీ జిల్లాలో కనిపిస్తున్నాయి. గతేడాది ఆగస్టు వరకు రోజుకు ఒకటి, రెండు కేసుల చొప్పున నమోదైనా.. ఆ తర్వాత పూర్తిగా తగ్గిపోయింది. అయితే ఇటీవల మళ్లీ కోరలు చాస్తోందని, కొత్త రూపంలో వ్యాప్తి చెందుతోందనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఎక్కువ మంది దగ్గు, జలుబు, జ్వరం, గొంతు నొప్పి సమస్యలతో బాధ పడుతూ ఆస్పత్రులకు వెళుతున్నారు. దీన్ని ఇన్‌ఫ్లూయెంజాగా వైద్యులు సూచిస్తున్నారు. అయితే ఇటీవల జిల్లాలో కరోనా ఛాయలు సైతం కనిపిస్తున్నాయి. వైద్య శాఖ పరీక్షలు నిర్వహించకపోవడంతో ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించడం మానేశారు. నాలుగు రోజుల క్రితం ఆర్టీసీ మణుగూరు డిపోకు చెందిన ఒక అధికారి కరోనా మహమ్మారి బారిన పడ్డారని సమాచారం. కరోనా లక్షణాలు ఉండడంతో వైద్యులను సంప్రదించగా టెస్టుల్లో అతనికి పాజిటివ్ అని తేలింది. దీంతో మళ్లీ అలజడి మొదలైందని తెలుస్తోంది. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమై కరోనాపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పరీక్షల సంఖ్య పెంచాలని పలువురు కోరుతున్నారు. దీనిపై జిల్లా కోవిడ్ సర్వైవల్ అధికారి ఇమ్మానియేల్‌ను వివరణ కోరగా ఎవరికైనా కోవిడ్ లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. కొద్దిపాటి లక్షణాలున్నా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి అశోకచక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రామాలయంలో భక్తుల రద్దీ





స్వామివారి దర్శనం కోసం వేచిచూస్తున్న భక్తులు (ఇన్‌సెట్) సెల్‌ఫోన్ కౌంటర్ వద్ద భక్తుల రద్దీ

సెల్‌ఫోన్ కౌంటర్ల వద్ద తీవ్ర ఇక్కట్లు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజుతో పాటు బ్రహ్మోత్సవాలు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక, సర్వ దర్శనాల క్యూలైన్లన్నీ నిండిపోయాయి. దీంతో ఆలయంలో, లడ్డూల కౌంటర్ వద్ద సందడి నెలకొంది. కాగా, స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులు సెల్‌ఫోన్ కౌంటర్ల వద్ద తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దర్శనానికి వెళ్లే తూర్పు ద్వారం వద్ద సెల్‌ఫోన్ కౌంటర్ ఏర్పాటు చేశారు. అక్కడ ఫోన్లు ఉంచి, స్వామివారి దర్శనానంతరం పడమర మెట్ల ద్వారా బయటకు వస్తున్నారు. ఇక్కడ సెల్‌ఫోన్‌లను అందించే అవకాశం ఉన్నప్పటికీ ఇవ్వకుండా, లిఫ్ట్ వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ వద్దకు పంపిస్తున్నారు. దీంతో భక్తులు చుట్టూ తిరిగి మళ్లీ లిఫ్ట్ వద్ద ఉన్న కౌంటర్ వద్దకు వచ్చి సెల్‌ఫోన్‌లు తీసుకోవాల్సి వస్తోంది. దీంతో కాలాతీతంతో పాటు ఎండలో ఇబ్బంది పడాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రధాన గోపురం ఎదురుగా భక్తులు లోనికి ప్రవేశించే మార్గం వద్ద టెంపుల్ ప్రొటెక్షన్ సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

కార్పొరేట్లకు దోచి పెడుతున్నారు..

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు
- వైరాలో 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర, బహిరంగ సభ



ఠాక్రే, రేణుకాచౌదరిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైరా/వైరారూరల్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్పొరేట్ శక్తులకు ప్రజాధనాన్ని దోచిపెడుతోందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే ఆరోపించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండగా.. ఇక్కడ బీజేపీ అడ్రస్సే లేదని ఎద్దేవా చేశారు. వైరాలో ఆదివారం నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర, సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ దేశంలో అరాచక పాలన సాగిస్తున్న బీజేపీ.. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన యాత్రతో వస్తున్న ఆదరణను ఓర్వలేక పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయించిందని విమర్శించారు. ఏదిఏమైనా కాంగ్రెస్‌ను ప్రజల నుంచి ఎవరూ దూరం చేయలేరని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి నిధులేవి?

కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న కేంద్రప్రభుత్వం నిరుపేదలకు అన్యాయం చేస్తుండగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు బేడీలు వేయించిందని కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి విమర్శించారు. సభలో ఆమె మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని పార్లమెంట్‌లో లేకుండా చేయడం ప్రశ్నించే వ్యక్తులను తట్టుకోలేని బీజేపీ తీరుకు నిదర్శనమని మండిపడ్డారు. కాగా, రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన సాగుతోందని ఆరోపించారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లకు నిధులు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. భవిష్యత్ తరాలు బాగుండాలంటే రానున్న ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఆరుగురు ఎమ్మెల్యేలను గెలిపించిన పార్టీ శ్రేణులు, వచ్చే ఎన్నికల్లో పదికి పది స్థానాల్లో విజయానికి పాటుపడాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ మాట్లాడారు. తొలుత వైరాలో అయ్యప్ప దేవాలయం నుండి తల్లాడ రోడ్డులోని సభా ప్రాంగణం వరకు ట్రాక్టర్లు, బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకాచౌదరి ట్రాక్టర్ నడుపుతుండగా, మాణిక్యరావు ఠాక్రే, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రోహిత్ చౌదరి, ధరావత్ రామ్మూర్తి నాయక్ తదితరులు వెళ్లారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కట్ల రంగారావు అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు సూరంపల్లి రామారావు, మానవతారాయ్, భవానీరెడ్డి, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, యడవల్లి కృష్ణ, కట్ల సంతోష్, కట్ల నాగరాజు, సున్నా ప్రసాద్, మాధవీరెడ్డి, మంజుల, లక్కినేని సురేందర్, చంద్ర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ర్యాలీ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు ఎం.డీ.ముస్తఫా కాలిపైకి ట్రాక్టర్ ఎక్కడంతో గాయపడగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఈ దిశగా కృషి చేస్తూ విజయం సాధిస్తేనే ఉపాధ్యాయ ఉద్యమ నేత అప్పారి వెంకటస్వామికి ఘనమైన నివాళి అర్పించినట్లవుతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఖమ్మం జెడ్పీ సమావేశ మందిరంలో యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాంతాలు, కేడర్ల వారీగా ఉపాధ్యాయ ఉద్యమం చీలిపోయినప్పుడు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ను వెంకటస్వామి స్థాపించారని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల సామాజిక హోదా పెంపుదల, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారని తెలిపారు. అనంతరం యూటీఎఫ్ స్థాపనలో కీలక భూమిక పోషించిన నాయకులకు సన్మానించారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ.జంగయ్య, చావా రవి, దుర్గాభవాని, రాజు, మాణిక్‌రెడ్డి, బండి నర్సింహారావు పాల్గొన్నారు.

ఖమ్మం డిపోకు ఆర్టీసీ ఏసీ స్లీపర్ బస్సు!

- హైదరాబాద్‌లో నేడు ప్రారంభం.. ఆ తర్వాత జిల్లాకు కేటాయింపు
- అత్యాధునిక సౌకర్యాలతో సిద్ధమైన 'లహరి' బస్సులు



లహరి ఏసీ స్లీపర్ బస్సు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రైవేట్ రవాణా సంస్థలకు దీటుగా సేవలందించేందుకు తెలంగాణ ఆర్టీసీ తొలిసారి ఏసీ స్లీపర్ బస్సులను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ బస్సుల్లో ప్రయాణికుల భద్రత కోసం అనేక అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నారు. 'లహరి – అమ్మ ఒడి అనుభూతి'గా పేరు పెట్టిన ఈ బస్సులను హైదరాబాద్‌లో సోమవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించనుండగా, ఖమ్మం డిపోకు కూడా బస్సులను కేటాయించనున్నారు.

ఏమేం సౌకర్యాలు...

12మీటర్ల పొడవుతో ఉండే లహరి బస్సుల్లో లోయర్ 15, అప్పర్ 15 బెర్త్‌లు కలిపి 30బెర్త్‌లు ఉంటాయి. ప్రతీ బెర్త్ వద్ద వాటర్ బాటిల్ పెట్టుకునే సదుపాయంతో పాటు మొబైల్ చార్జింగ్ సాకెట్, రీడింగ్ ల్యాంప్ ఏర్పాటు చేశారు. ట్రాకింగ్ సిస్టమ్, ఆపద ఎదురైతే అప్రమత్తం చేసేలా ప్యానిక్ బటన్, గమ్యస్థానాల వివరాలు తెలిపేందుకు ముందు, వెనుక ఎల్‌ఈడీ డిస్‌ప్లే బోర్డులు, సెక్యూరిటీ కెమెరాలు, రివర్స్ పార్కింగ్ అసిస్టెన్స్ కెమెరా బిగించారు. అత్యాధునిక ఫైర్ డిటెక్షన్, అలారం సిస్టం, పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఈ కొత్త ఏసీ స్లీపర్ బస్సుల్లో సమకూర్చారు. ఇవేకాకుండా ఉచిత వైఫై సదుపాయం కూడా కల్పిస్తుడడం విశేషం. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఈ బస్సులు సౌకర్యం ఉంటాయని చెబుతున్నారు.

క్లుప్తంగా

కాలినడకన రామదండు..



భద్రాచలం కాలినడకన వెళ్తున్న రామభక్తులు

అశ్వారావుపేటరూరల్: ఏపీలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన శ్రీరామభక్తులు భద్రాచలానికి కాలినడకన తరలివస్తున్నారు. దాదాపు ఆరు వేల మంది భక్తులు పాదయాత్రగా వస్తుండగా, వారికి ఆదివారం అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి సమీపంలోని శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పలువురు దాతలు భోజనాలు ఏర్పాటు చేశారు. వడ్డెర సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రతి ఏటా ఆయా జిల్లాల నుంచి రామదండు పేరుతో భక్తులు కాలినడకన భద్రాచలం రామాలయానికి వస్తుంటారు.

ముత్యాలమ్మ తల్లి జాతర ఆదాయం రూ.14.90 లక్షలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ తల్లి జాతర ఉత్సవాల ఆదాయాన్ని ఆదివారం లెక్కించారు. ఈనెల 19 నుంచి 23 వరకు జరిగిన ఉత్సవాల సందర్భంగా వివిధ రకాల దుకాణాల ఏర్పాటు, హుండీ ఆదాయం, అమ్మవారి దర్శన టికెట్ల విక్రయాల ద్వారా మొత్తం రూ.14.90 లక్షలు వచ్చాయని ఆలయ ఈఓ సూర్య ప్రకాశ్‌రావు తెలిపారు. కాగా గతేడాది జాతర ఉత్సవాల ద్వారా మొత్తం రూ.13.19 లక్షల ఆదాయం రాగా, ప్రస్తుతం రూ.1.71 లక్షలు అదనంగా సమకూరినట్లు చెప్పారు.

బంగారం చోరీ

ఇల్లెందు: పట్టణ పరిధిలోని స్టేషన్ బస్తీలో ఓ ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆదివారం వెలుగుచూసింది. ఈ నెల 24న స్టేషన్ బస్తీకి చెందిన శీలం మల్లయ్య భూపాలపల్లిలో ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లాడు. ఆదివారం తిరిగి ఇంటికి వచ్చి చూడగా.. తాళం పగులకొట్టి, బీరువాలో ఉన్న రూ.10వేల నగదు, 2 తులాల బంగారం చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ బి.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జగదీశ్‌కాలనీలో ఆభరణాలు..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని జగదీశ్ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆదివారం వెలుగుచూసింది. కాలనీలో నివాసం ఉంటున్న వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పని మీద వేరే ఊరు వెళ్లాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. తలుపులు, బీరువాలు పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలను అపహరించారు. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వగా, వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పర్ణశాలలో సెల్‌ఫోన్లు..

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శనివారం అర్ధరాత్రి మూడు స్మార్ట్ ఫోన్లను చోరీ చేశారు. ఆంజనేయస్వామి మాలధారుల ఫోన్లు రెండు, మరో ట్రాక్టర్ డ్రైవర్ ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌ను అడ్డుకున్న ముగ్గురు యువకులపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని చింతలబజారులో కానిస్టేబుల్ సంతోష్ పెట్రోలింగ్ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన యువకులు సీహెచ్ సతీష్, గోపి, నర్సింహారావులను అక్కడి నుంచి వెళ్లి పోవాల్సిందిగా సూచించాడు. దీంతో ముగ్గురు యువకులు కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగారు. విధులను అడ్డుకున్నారు. కానిస్టేబుల్ ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురికి గాయాలు

మణుగూరుటౌన్: మండలంలోని తిర్లాపురం గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. బయ్యారానికి చెందిన ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనంపై మణుగూరు వైపు వస్తున్నాడు. అదే సమయంలో ఆ వాహనం వెనుక పెద్దిపల్లికి చెందిన గొత్తికోయలు ముగ్గురు తమ ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో ముందున్న బైక్‌ను ఢీకొని కింద పడటంతో ముగ్గురు గొత్తికోయలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు మణుగూరు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని జగదీశ్ కాలనీలో ఆదివారం ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం... జగదీశ్ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం (22) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. పడుకుంటానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రి తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. కాగా మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

వేసవి నుంచి ఉపశమనం..

- ఆర్టీసీ కార్మికులకు మజ్జిగ పంపిణీ
- బస్టాండ్లలో ప్రయాణికులకు చల్లని తాగునీరు
- ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్న యాజమాన్యం





కొత్తగూడెం బస్టాండ్‌లో ప్రారంభానికి సిద్ధమైన ఆర్వో ప్లాంట్, (ఇన్‌సెట్) బస్టాండ్‌లో ఏర్పాటు చేయనున్న వాటర్ కూలర్

చుంచుపల్లి: ప్రయాణికులు, సిబ్బందికి వేసవితాపం నుంచి ఉపశమనం కల్పించేందుకు ఆర్టీసీ యాజమాన్యం చర్యలు చేపడుతోంది. ఎండ తీవ్రత నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు కార్మికులకు మజ్జిగ, ప్రయాణికులకు చల్లని తాగునీరు అందిస్తున్నారు. జిల్లాలో రెండు, మూడేళ్లుగా వేసవిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 49 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటికే పాల్వంచ మండలం యానంబైలులో 40.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని చల్లని మజ్జిగ, తాగునీరు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు మూడు డిపోలు ఉండగా 915 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ జిల్లా నుంచి 50 వేల మందికి పైగా ప్రయాణికులు ఆర్టీసీలో రాకపోకలు సాగిస్తుండగా, రూ.42 లక్షల ఆదాయం సమకూరుతోంది. భద్రాచలం డిపోలో మొత్తం 403 మంది సిబ్బంది ఉండగా, రోజువారీగా 180 మంది డ్రైవర్లు, కండక్టర్లు విధులకు హాజరవుతారు. మణుగూరు డిపో పరిధి లో 282 మంది సిబ్బంది ఉండగా, రోజువారీగా 200 మంది, కొత్తగూడెం డిపో పరిధిలో 230 మంది సిబ్బంది ఉండగా, రోజువారీగా 140 మంది కార్మికులు విధులకు హాజరవుతున్నారు. డిపోల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో విధులకు వచ్చే డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర గ్యారేజీ సిబ్బందికి నాలుగైదు రోజులుగా మధ్యాహ్నం వేళ మజ్జిగ అందిస్తున్నారు. ఒక్కో కార్మికుడికి 250 మి.లీ మజ్జిగ ప్యాకెట్ ఇస్తుండగా, ఒక్కో ప్యాకెట్ ధర రూ.10 ఉందని అధికారులు తెలిపారు.

ప్రయాణికుల కోసం వాటర్ కూలర్లు

ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే భద్రాచలం, మణుగూరు బస్టాండ్లలో ఒక్కొక్కటి చొప్పున ఇప్పటికే వాటర్ కూలర్లను అందుబాటులో ఉంచారు. ఇవి ఒక్కోటి రూ.46 వేల చొప్పున కొన్నారు. తాజాగా కొత్తగూడెం డిపోకు నాలుగు, భద్రాచలం, మణుగూరు డిపోలకు ఒక్కోటి చొప్పున వాటర్ కూలర్లు వచ్చాయి. కొత్తగూడెం డిపో పరిధిలో కొత్తగూడెం బస్టాండ్‌లో రెండు, పాల్వంచ ఒకటి, ఇల్లెందులో ఒకటి చొప్పున వీటిని ఏర్పాటు చేయనున్నారు. కొత్తగూడెం బస్టాండ్‌లో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు దాతల సహాయంతో రెండు రోజుల్లో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించబోతున్నారు. జిల్లావ్యాప్తంగా ఆర్టీసీ యాజమాన్యం చల్లని తాగునీరు ఏర్పాటు చేస్తుండటంతో ప్రయాణికుల దాహార్తి తీరుతోంది.



కొత్తగూడెం డిపోలో ఆర్టీసీ కార్మికులకు మజ్జిగ అందజేస్తున్న సిబ్బంది

కొంత ఉపశమనం..



మండుతున్న వేసవి దృష్ట్యా కొత్తగూడెం డిపోలో నాలుగైదు రోజులుగా అధికారులు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో అందించడం వల్ల వేసవి తాపం నుంచి కొంత ఉపశమనం పొందుతున్నాం.

– వి.శ్రీనివాస్, ఆర్టీసీ కార్మికుడు, కొత్తగూడెం

డిపోలో 140 మందికి మజ్జిగ..



వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు సంస్థ బస్టాండ్లలో వాటర్ కూలర్లను ఏర్పాటు చేస్తోంది. కొత్తగూడెం డిపోకు కొత్తగా 4 వాటర్ కూలర్లు వచ్చాయి. ఇక డిపో పరిధిలో రోజువారీ విధులకు వచ్చే 140 మంది కార్మికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నాం. – బి.వెంకటేశ్వరరావు, కొత్తగూడెం డీఎం

పవన్ కల్యాణ్‌కు మెరుగైన వైద్యసేవలు

'సాక్షి' కథనంతో స్పందించిన మంత్రి హరీశ్‌రావు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వాపురం: నిమ్స్ ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మండల పరిధిలోని అంబేడ్కర్ నగర్ గ్రామానికి చెందిన నిరుపేద దివ్యాంగుడు తోకల వెంకటేశ్వర్లు కుమారుడు తోకల పవన్‌కల్యాణ్‌కు మెరుగైన వైద్యం అందనుంది. పవన్ కల్యాణ్ దీనావస్థపై ఈ నెల 26న 'ఆపన్న హస్తం అందించరూ' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్‌కు మెరుగైన వైద్యం అందించాలని, ఆస్పత్రి బిల్లు విషయంలో ప్రభుత్వం సహకారం అందిస్తుందని సూచించారు. మంత్రి హరీశ్‌రావు కార్యాలయం సిబ్బంది బాధితుడు తండ్రి తోకల వెంకటేశ్వర్లుతో మాట్లాడి అధైర్యపడొద్దని, ప్రభుత్వ పక్షాన వైద్య సేవలకు, ఆస్పత్రి బిల్లు విషయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు మంత్రి హరీశ్‌రావు పీఆర్‌ఓ సిద్దార్థ 'సాక్షి'తో మాట్లాడి వివరాలు తెలిపారు.

కొత్త రాజకీయం కావాలి

- రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు
- హెల్త్ క్యాంపునకు విశేష స్పందన



మాట్లాడుతున్న గడల శ్రీనివాసరావు

సుజాతనగర్: కొత్తగూడెం నియోజకవర్గం మౌలిక వసతులు, ఇతర అంశాల్లో అభివృద్ధి సాధించాల్సింది ఇంకా ఉందని, నియోజకవర్గానికి కొత్త సూర్యోదయం, కొత్త రాజకీయాలు కావాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్, జీఎస్సార్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గడల శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ స్టార్ హాస్పిటల్స్, కిమ్స్ హాస్పిటల్స్ సహకారంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గడల శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ చేసే అవకాశం ఏ రూపంలో వచ్చినా స్వీకరిస్తానని తెలిపారు. అందరికీ విద్య, ఆరోగ్యం, ఉపాధితో పాటు ఉజ్వల భవిష్యత్ అందించడం, కులాలు, మతాలకు అతీతంగా సాటి మనిషి పట్ల మానవత్వం చూపడమే తన జెండా, అజెండా అని పేర్కొన్నారు. కూడు, గూడు, గుడ్డ ప్రతీవారికి అవసరమని అన్నారు. మీ కుటుంబ సభ్యుల్లో ఒకడిగా భావించి తనను ఆశీర్వదించాలని కోరారు. కాగా శిబిరానికి 2,316 మంది హాజరుకాగా 60 మంది వైద్యులు, 100 మంది సహాయ సిబ్బంది సేవలందించారు. వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 263 మందిని మెరుగైన వైద్యానికి సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ జాగృతి అధ్యక్షుడు చెల్లంశెట్టి హరిప్రసాద్, సర్పంచ్ సీకా కృష్ణవేణి, ఎంపీటీసీ పెద్దమల్ల శోభారాణి, ఉప సర్పంచ్ లింగం పిచ్చిరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ కొమారి కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోడ హరినాయక్, ఆర్‌ఎంపీ వైద్యులు పోటు రాఘవరావు, వెంకట్రావు, సాంబశివరావు, అప్పారావు, కాంగ్రెస్ నాయకులు చింతలపూడి రాజశేఖర్, ట్రస్ట్ మేనేజర్ అంజీ, సిబ్బంది మోదుగు జోగారావు, ప్రభాకర్, బోడా వినోద్, పవన్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి అంతిమ వీడ్కోలు పలికిన మంత్రి



బాల్యమిత్రుడు శ్రీధర్ పాడె మోస్తున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం అర్బన్: బాల్యమిత్రుడు కొల్లి శ్రీధర్ మృతిపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విచారం వ్యక్తం చేశారు. ఈమేరకు ఖమ్మం శ్రీనగర్ కాలనీకి చెందిన శ్రీధర్ మృతదేహం వద్ద మంత్రి ఆదివారం నివాళులర్పించి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. అంతేకాక అంతా తానై అంతిమయాత్ర ఏర్పాట్లలో పాలుపంచుకున్న ఆయన, శ్రీధర్‌తో తన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. సుదీర్ఘకాలం మమత వైద్యసంస్థలకు ఆయన అందించిన సేవలను మంత్రి గుర్తు చేసుకోగా... శ్రీధర్ అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు.

నృత్య ప్రదర్శనలో అవార్డు



సర్టిఫికెట్‌తో మాన్వి

ఖమ్మంఅర్బన్: ఖమ్మంకు చెందిన డాక్టర్ జి.వెంకటేశ్వరరావు – అనితరావు కుమార్తె మాన్వి హైదరాబాద్‌లో ఆదివారం డాక్టర్ నటరాజరామకృష్ణ 100వ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన నృత్యప్రదర్శనలో పాల్గొని అవార్డు దక్కించుకుంది. ఈసందర్భంగా ఆమెకు కళానిలయం సాంస్కృతిక సేవా సంస్థ బాధ్యులు అవార్డు, సర్టిఫికెట్ అందజేసి సన్మానించారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

ఖమ్మంక్రైం: నగరంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఖమ్మం త్రీటౌన్ జహీర్‌పురకు చెందిన పారిశుద్ధ్య కార్మికుడు ఉపేందర్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగగా గృహోపకరణాలు కాలిపోయాయి. అగ్నిమాపకశాఖ సిబ్బందికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

యోగాపై అవగాహన పెంపొందించుకోవాలి



యోగా కోచ్‌ను సత్కరిస్తున్న సీఎంఓ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: ప్రతిఒక్కరు యోగా విశిష్టతను తెలుసుకుని అవగాహనను పెంపొందించుకోవాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి(సీఎంఓ) యలగందుల రాజశేఖర్ ఆకాంక్షించారు. నగరంలోని సెంచరీ ఆడిటోరియంలో ఇస్తున్న యోగా శిక్షణ ఆదివారం ముగియగా, ఆయన మాట్లాడారు. వ్యాయా మ, ఆరోగ్య విద్యకు నూతన జాతీయ విద్యా విధానంలో ప్రాధాన్యత కల్పించారని తెలి పారు. ఇందులో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖతో కలిసి ఆరోగ్య విద్యపై డీఆర్పీలకు శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం అరుణ యోగా సంస్థకు చెందిన శిక్షకులను సన్మానించారు. సెంచరీ స్కూల్ అధినేత ప్రభాకర్‌రావు, శిక్షకులు మనోజ్ఞ, చంద్రశేఖర్, పుష్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన



మిట్టపల్లిలో ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

తల్లాడ/వేంసూరు: ఖమ్మం జిల్లా తల్లాడ, వేంసూరు మండలాల్లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పర్యటించారు. ఈసందర్భంగా తల్లాడ మండలం మిట్టపల్లి, నారాయణపురం, ముద్దునూరు, రంగాపురం గ్రామాల్లో పర్యటించిన ఆయన మిట్టపల్లిలో మల్లికార్జున స్వామి దేవాలయంలో పూజలు చేశారు. అలాగే, పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన ఆయన, అవార్డు అందుకున్న తల్లాడ పంచాయతీ సర్పంచ్ పాట్టేటి సంధ్యారాణి, బ్రహ్మారెడ్డి దంపతులను సన్మానించారు. ఇక వేంసూరు మండలం భీరపల్లి, చౌడవరం తండా, అడసర్లపాడు, చిన్నమల్లెల గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలకు కూడా పొంగులేటి హాజరయ్యారు. డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యతో పాటు నారపోగు వెంకటేశ్వర్లు, గోపిశెట్టి వెంకటేశ్వర్‌రావు, యరమల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎర్రి నరసింహారావు, తుమ్మలపల్లి రమేష్, గొడుగునూరి లక్ష్మీరెడ్డి, అయిలూరి రాజశేఖర్‌రెడ్డి, పోట్రు శ్రీను, మీర్జా మహబు, అట్లూరి సత్యనారాయణరెడ్డి, బండి వెంకటేశ్వరరెడ్డి, బండి శ్రీనివాసరెడ్డి, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జంగ జమలయ్య, జమ్ముల శ్రీనివాసరావు, మల్లెల్లి నర్సింహారావు పాల్గొన్నారు.

రాధాకృష్ణ మందిరానికి సహకారం..

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్/ఖమ్మం అర్బన్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఖమ్మంలో పర్యటించారు. ఖానాపురంలోని రాధాకృష్ణ మందిరాన్ని సందర్శించిన ఆయన నిర్వాహకులను అభినందించడంతో పాటు నిర్వహణకు సహకరిస్తానని తెలిపారు. ఇంకా ఖమ్మం రూరల్ మండలం తీర్థాల, కస్నాతండా, పెదతండా గ్రామాల్లో కూడా పర్యటించారు. ఎంపీపీ గోసు మధు, కార్పొరేటర్లు మలీదు జగన్, దొంగల సత్యనారాయణ, నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, పుల్లారావు, మామిడాల పుల్లయ్య, లక్ష్మీనారాయణ, బిక్కసాని స్వరూపరాణి, ఇమాం, అప్పన్న పిచ్చన్న, గోపి, తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి సేవలు



వృద్ధుడికి అన్నం తినిపిస్తున్న వాచ్‌మెన్



స్నానం చేయిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది, దాతలు అనాథ వృద్ధుడికి సేవలందించారు. స్థానిక పేపర్ బోర్డు ఎదురుగా ఉన్న చెట్టు కింద కొద్ది రోజులుగా అరవై ఏళ్లపైబడిన ఓ అనాథ వృద్ధుడు జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి ఆరోగ్య పరిస్థితి విషమించి ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. గమనించిన కొందరు స్థానికులు సోషల్ మీడియాలో పెట్టడంతో భోగవల్లి రాంబాబు అనే దాత వృద్ధుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. సహాయకులు లేకపోవడంతో ఆస్పత్రి వాచ్‌మెన్ తానికొండ వెంకటేశ్వరరావు వృద్ధుడికి భోజనం తినిపించాడు. ఆదివారం ఉదయం ఆస్పత్రి స్వీపర్లు తగరం శోభ, వాచ్‌మెన్ వెంకట కృష్ణ కలిసి స్నానం చేయించి నూతన దుస్తులు వేశారు. డేగల రాము అనే దాత క్షవరం చేయించారు. వృద్ధుడికి సేవలందించిన దాతలు, ప్రభుత్వ సిబ్బందిని పలువురు ప్రశంసిస్తున్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: ముదిగొండ మండల లక్ష్మీపురానికి చెందిన బి.రాజేష్(38) ఈనెల 21న ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లిలో పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. రాజేష్‌కు తెల్దారుపల్లికి చెందిన బి.శాలినితో వివాహం జరగగా ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన ఆరోగ్యం క్షీణించడంతో పురుగుల మందు తాగగా తెల్దారుపల్లికి వచ్చి పడిపోయాడు. దీంతో చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, ఆదివారం మృతి చెందాడని ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

గాయపడిన వ్యక్తి..

తిరుమలాయపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని తిమ్మక్కపేట గ్రామానికి చెందిన భాషపొంగు వీరస్వామి(39) ఈనెల 5న తిమ్మక్కపేట నుండి మోటార్‌సైకిల్ పై తిరుమలాయపాలెం వెళ్తుండగా కొక్కిరేణి సమీపాన అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా ఆదివారం మృతిచెందాడు. వీరస్వామికి భార్య వెంకమ్మ, కుమారుడు సురేష్ ఉన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు..

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లోని రెండో నెంబర్ ప్లాట్‌ఫాం వైపు గూడ్స్ అడ్డా వద్ద గుర్తుతెలియని వృద్ధుడు(70) శనివారం మృతి చెందాడు. అనారోగ్యంతో ఆయన మృతి చెంది ఉండొచ్చని రైల్వే పోలీసులు వెల్లడించారు. అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాసరావు సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించగా, ఆచూకీ తెలిసిన వారు 94406 27535 నంబర్‌లో సంప్రదించాలని జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు సూచించారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



ప్రభాస్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: కారు ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన అశ్వారావుపేటలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా టీ నర్సాపురం మండలం మక్కినవారిగూడేనికి చెందిన రామారావు, సోమలమ్మ దంపతుల కుమారుడు గుడిదల ప్రభాస్(20) ఏడాది కాలంగా అశ్వారావుపేట మండలంలోని పేరాయిగూడెంలో ఉన్న తన అమ్మమ్మ నార్లపాటి సూరిబాయమ్మ ఇంట్లో ఉంటున్నాడు. స్థానికంగా ఓ మెకానిక్ షెడ్డులో పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి జంగారెడ్డిగూడెం రోడ్‌లో ఉన్న పెట్రోల్ బంక్ వద్దకు బైక్‌పై వెళ్తుండగా వెనుక వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో ప్రభాస్ ఎదురుగా వచ్చిన లారీ కింద పడిపోగా, లారీ ముందు టైర్లు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోగా, పోలీసులు గాలిస్తున్నారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శవ పంచనామా జరిపించారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై బి.రాజేశ్ కుమార్ తెలిపారు.

ఇల్లెందులో లారీ ఢీకొని..



సాయి (ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని జగదాంబసెంటర్ కూడలి సమీపంలో ఉన్న నాగమణి బేకరీ వద్ద ఆదివారం రాత్రి లారీ ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. జగదాంబసెంటర్ సమీపంలో నివాసం ఉంటున్న సాయి (25) పని నిమిత్తం బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో లారీ టైర్లు సాయి తలమీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ ఆగకుండా వెళ్లిపోగా స్థానికులు కొద్దిదూరం వరకు వెంబడించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా చేసి, పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా చిక్కకుండా వెళ్లిన లారీ ఆచూకీ కోసం సీసీ కెమెరాల పుటేజీల ద్వారా పోలీసులు అన్వేషిస్తున్నారు. మృతుడికి తల్లి రజిత, తండ్రి ఉమాశంకర్ ఉన్నారు.

డేటా లీకు.. హైదరాబాద్‌తో లింకు

తెలుగు రాష్ట్రాల ప్రజల వ్యక్తిగత సమాచారం కూడా చౌర్యం

- నేరస్తుల చేతుల్లో బ్యాంకు ఖాతాదారుల వివరాలు
- లోతుగా ఆరా తీస్తున్న సైబరాబాద్ పోలీసులు
- త్వరలోనే జస్ట్ డయల్, గూగుల్, పలు కంపెనీలకు నోటీసులు
- రక్షణ శాఖ వివరాల తస్కరణపై ఆరా తీసిన ఆర్మీ, ఢిల్లీ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన డేటా లీకు కేసు తీగ లాగితే డొంక కదులుతోంది. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు హైదరాబాద్‌తోనూ లింకులు ఉన్నట్లు సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారస్తులు, విద్యార్థులు, గృహిణులు, రక్షణ శాఖ, టెలికం విభాగం ఇలా 138 విభాగాలకు చెందిన 16.8 కోట్ల మంది వ్యక్తిగత వివరాలను చౌర్యం చేసి, విక్రయిస్తున్న ఏడుగురు అంతరాష్ట్ర ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తొలుత నోయిడా, ఢిల్లీ వంటి ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ప్రజల వ్యక్తిగత సమాచారం మాత్రమే ఉందని పోలీసులు భావించినప్పటికీ... దర్యాప్తు చేస్తున్న కొద్దీ కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ డేటాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రజల వ్యక్తిగత వివరాలు సైతం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇప్పటికే నిందితుల నుంచి స్వాధీనం చేసు కున్న డేటాను సైబరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పోలీసు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ సైబర్ సేఫ్టీ (టీఎస్‌పీసీసీ) ద్వారా పోలీసులు విశ్లేషిస్తున్నారు.

ఎవరా హైదరాబాదీ..

తెలుగు రాష్ట్రాలకు చెందిన బ్యాంకు డెబిట్, క్రెడిట్ కార్డు ఖాతాదారుల వివరాలు తస్కరణకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు, పిన్, సీవీవీ నంబర్లతో సహా ఫోన్ నంబర్లు, చిరునామా వంటి సమాచారం ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ డేటా లీకుపై హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లోతుగా ఆరా తీస్తుంది. ఇదిలా ఉండగా.. రక్షణ శాఖకు చెందిన 2.6 లక్షల మంది వ్యక్తిగత వివరాలు సైతం నిందితులు చౌర్యం చేసిన నేపథ్యంలో.. ఆర్మీ విభాగం, ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయా వివరాలను విశ్లేషించేందుకు సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు సైబరాబాద్ పోలీసులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ విభాగాల నుంచి కాకుండా థర్డ్ పార్టీ ఏజెన్సీల నుంచే ఈ సమాచారం బహిర్గతమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

టెక్నాలజీ నిపుణుల సహాయంతో..

సైబరాబాద్ డీసీపీ కల్మేశ్వర్ శింగేన్వర్ నేతృత్వంలో 9 మంది పోలీసులతో ఏర్పాటైన సిట్.. ఈ కేసును 360 డిగ్రీల కోణంలో దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు పూర్తిగా సాంకేతిక అంశంపైనే ఆధారపడి ఉండటంతో సైబరాబాద్ పోలీసులు పలు టెక్నాలజీ నిపుణుల సహాయాన్ని తీసుకుంటున్నారు. తస్కరించిన డేటాను నిందితులు జస్ట్ డయల్‌లో డేటా ప్రొవైడర్ల పేర్లతో రూ.2 వేలకు 50 వేల మంది ప్రజల సమాచారాన్ని విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. దీంతో తొలి దశలో జస్ట్ డయల్, గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్ కంపెనీలతో పాటు బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులను విచారించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ క్రమంలో త్వరలోనే ఆయా కంపెనీలకు నోటీసులు జారీ చేయనున్నామని ఓ పోలీసు ఉన్నతాధికారి వెల్లడించారు. ఈ కేసు గొలుసుకట్టు మార్కెటింగ్ తరహాలో ఉండటంతో అనేక మందికి ఈ కేసుతో సంబంధాలుండే అవకాశం ఉందని, త్వరలోనే మరికొందరిని అరెస్టు చేస్తామని తెలిపారు.

గల్ఫ్ ప్రవాసుల ప్రభావమెంత..?

రాజకీయ స్థితిగతులపై ఇంటెలిజెన్స్, ఎస్‌బీ వర్గాల ఆరా

32 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమాచారం సేకరించే పనిలో యంత్రాంగం

మోర్తాడ్(బాల్కొండ): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గల్ఫ్ ప్రవాసుల ప్రభావంపై ఏమేరకు ఉంటుందనే అంశంపై అధికార బీఆర్‌ఎస్ అప్పుడే దృష్టి సారించింది. ఎన్ని నియోజకవర్గాల్లో ఎంతమంది ఓటర్లు ప్రభుత్వంపై ఎలాంటి అభిప్రాయంతో ఉన్నారనేదానిపై నిఘా వర్గాల ద్వారా ఆరా తీస్తోంది. గల్ఫ్ దేశాలకు ఎక్కువగా వలసలు కొనసాగుతున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు వర్గాలు పర్యటిస్తూ ప్రభుత్వానికి నివేదిక అందించే పనిలో నిమగ్నమయ్యాయి. తాజాగా గల్ఫ్ జేఏసీ వెల్లడించిన 32 నియోజకవర్గాలపైనే ఇంటెలిజెన్స్, ఎస్‌బీ వర్గాలు దృష్టి సారించడం విశేషం. గల్ఫ్ ప్రవాసులకు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో అధికార పక్షంపై వారు అసంతృప్తితో ఉన్నారనే చర్చ సాగుతోంది. ఈ క్రమంలో ప్రతిపక్ష పార్టీలవైపు ప్రవాసులు మొగ్గుచూపుతున్నారా, అలా అయితే ఎంత మేరకు అధికార పక్షానికి నష్టం వాటిల్లుతుందనే కోణంలో వివరాలను సేకరిస్తున్నారు.

గల్ఫ్ ఓటుబ్యాంకు సుమారు కోటి వరకు..

రాష్ట్రంలో గల్ఫ్ దేశాలకు వలస వెళ్లినవారి సంఖ్య 15 లక్షల వరకు నమోదు కాగా, ఇప్పటి వరకు వెళ్లి వచ్చినవారి సంఖ్య మరో 30 లక్షలు ఉంటుందని అంచనా. అంటే గల్ఫ్ కుటుంబాల ఓటర్లు సుమారు కోటి మంది వరకు ఉండొచ్చని అంచనా. భారీ సంఖ్యలో గల్ఫ్ సంబంధిత ఓటర్లు ఉండటంతో వారి తీర్పు అభ్యర్థుల గెలుపోటములను ఖచ్చితంగా ప్రభావితం చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఏ గ్రామంలో ఎంతమంది గల్ఫ్ ప్రవాసులు ఉన్నారనే వివరాలను అధికార వర్గాలు సేకరిస్తున్నాయి.

రెండు కేటగిరీలుగా నియోజకవర్గాల విభజన

కేటగిరీ(ఏ) 14 నియోజకవర్గాలు (25 వేల నుంచి 30 వేల ఓట్ల ప్రభావం):

కేటగిరీ(ఏ)లో బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్, వేములవాడ, సిరిసిల్ల, చొప్పదండి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాలను గుర్తించారు.

కేటగిరీ(బీ)లో 18 నియోజకవర్గాలు (10 వేల నుంచి 20 వేల ఓట్ల ప్రభావం):

ఆదిలాబాద్, మంచిర్యాల, కరీంనగర్, హుజూరాబాద్, హుస్నాబాద్, మానకొండూర్, నిజామాబాద్ అర్బన్, బోధన్, పెద్దపల్లి, దేవరకద్ర, మక్తల్, మెదక్, సిద్దిపేట, దుబ్బాక, నల్లగొండ, మిర్యాలగూడ, భువనగిరి, పరిగి నియోజకవర్గాలు ఉన్నట్లు జేఏసీ గుర్తించింది. ఈ నియోజకవర్గాలపై నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఇంటెలిజెన్స్, ఎస్‌బీ వర్గాల నివేదికలతోనైనా ప్రభుత్వం వలస కార్మికుల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తుందా అనేది వేచి చూడాల్సి ఉంది.

కథ.. స్క్రీన్‌ప్లే.. దర్శకత్వం.. నారా చంద్రబాబునాయుడు

ఓటుకు కోట్లు 2.0

పోలింగ్ రోజు అసెంబ్లీ లాబీ వేదికగా కొనసాగిన ప్రలోభాల పర్వం



సాక్షి, అమరావతి:

చెప్పులు రుచి మరిగిన కుక్కకు
చెరకు తీపి రుచిస్తుందా?
పుట్టుకతో వచ్చిన గుణం
పుడమిలో కలిసేదాకా పోదు కదా!
బేరసారాలే ఊపిరిగా బతికే
నేతల నైజం కూడా అంతే!
కుమ్మక్కు రాజకీయాలు,
కొనుగోళ్లే వారి లక్షణం.. లక్ష్యం!

ఎనిమిదేళ్ల క్రితం.. తెలంగాణ శాసన మండలికి 2015లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేల కొనుగోళ్లకు ప్రయత్నించి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు ఏపీ శాసన మండలి ఎన్నికల్లోనూ అదే విధానాన్ని నమ్ముకుంది. ఓటుకు కోట్లను ఎర వేసింది. సంఖ్యాబలం లేకపోయినా బేరసారాలకు దిగి నిస్సిగ్గుగా క్రాస్ ఓటింగ్‌ను ప్రోత్సహించింది. ఆది నుంచి తాను నమ్ముకున్న కొనుగోళ్లు, కుమ్మక్కు రాజకీయాలనే మరోసారి అనుసరించింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించడంలో విఫలమైన వారితోపాటు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ టికెట్ దక్కదనే సంకేతాలున్న వారిని ప్రలోభాలకు గురి చేసి అనైతిక చర్యలకు పాల్పడింది. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ వాస్తవాలను వెల్లడించడంతో చంద్రబాబు స్క్రిప్టు ప్రకారం అమలైన 'ఓటుకు కోట్లు స్కాం 2.0' బహిర్గతమైంది.

బలం లేదని స్పష్టంగా తెలిసినా..

ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అయిన ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు తాజాగా జరిగిన ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ ద్వారా టీడీపీ తన అభ్యర్థి పంచుమర్తి అనూరాధను గట్టెక్కించుకోగలిగింది. శాసనసభలో మొత్తం సభ్యుల సంఖ్య 175 కాగా వైఎస్సార్‌సీపీకి 151 మంది సభ్యులున్నారు. టీడీపీ తరపున గెలిచిన 23 మందిలో నలుగురు ఆదిలోనే ఆ పార్టీకి దూరంగా జరగడంతో సాంకేతికంగా ఉన్న సభ్యులు 19 మంది మాత్రమే. జనసేన నుంచి గెలిచిన ఎమ్మెల్యే రాపాక కూడా ఆ పార్టీకి దూరంగానే ఉంటున్నారు. టీడీపీ, జనసేన విధానాలతో విబేధించిన ఆ ఐదుగురు ఎమ్మెల్యేలూ వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తున్నారు. అంటే అధికార పార్టీకి సాంకేతికంగా ఉన్న సభ్యులు 156 అని స్పష్టమవుతోంది. ఒక్కో ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుపొందాలంటే 22 మంది ఎమ్మెల్యేల ప్రథమ ప్రాధాన్యత ఓట్లు అవసరం. వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన ఆధిక్యత ఉన్నందున ఖాళీ అయిన ఏడు స్థానాలకు తన అభ్యర్థులను బరిలోకి దించింది. గెలిచేందుకు తగిన బలం లేకున్నా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆ పార్టీ అభ్యర్థిని పోటీకి పెట్టారు. తగిన బలం లేకుండా టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించడాన్ని బట్టి చూస్తుంటే తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలోనే రూ.కోట్లు ఎర వేసి బేరసారాలకు చంద్రబాబు వ్యూహం రచించినట్లు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డితోపాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు ఆదిలోనే చెప్పారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.పది కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకూ వెదజల్లి కొనుగోలు చేసి టీడీపీ అభ్యర్థిని చంద్రబాబు గెలిపించుకున్నారని సజ్జలతోపాటు పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే రాపాక వాస్తవాలను వెల్లడించడంతో ఓటుకు కోట్లు స్కాం 2.0 బట్టబయలైంది.

అసెంబ్లీ లాబీ వేదికగా పదేపదే ప్రలోభాలు..

రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ జనసేన నుంచి గెలుపొందినా పవన్ కల్యాణ్ పోకడలను నిరసిస్తూ ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు. సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో సామాజిక విప్లవాన్ని ఆవిష్కరించిన సీఎం వైఎస్ జగన్ వెంట ప్రజాభీష్టం ప్రకారం నడుస్తున్నారు. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాపాకను ప్రలోభాలకు గురి చేసి తమ వైపునకు తిప్పుకునేందుకు ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే మంతెన రామరాజును చంద్రబాబు బరిలోకి దించారు. తన మిత్రుడు కేఎస్ఎన్ రాజు ద్వారా టీడీపీ ఎమ్మెల్యే మంతెన రామరాజు ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించినట్లు ఎమ్మెల్యే రాపాక తాజాగా మీడియాకు బహిర్గతం చేశారు. టీడీపీ అభ్యర్థికి ఓటు వేస్తే పెద్ద ఎత్తున డబ్బులతో పాటు పార్టీలో మంచి స్థానం కల్పిస్తామని రామరాజు తనకు ప్రతిపాదన పంపారని వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజు కూడా లాబీల్లో టీడీపీ ఎమ్మెల్యే మంతెన రామరాజు తనను పక్కకు పిలిచి మరోసారి ప్రలోభపెట్టారని రాపాక చెప్పారు. తనను పదేపదే ప్రలోభాలకు గురి చేసినా డబ్బులకు అమ్ముడుపోయి వ్యక్తిత్వాన్ని పోగొట్టుకోలేనని మరోసారి తేల్చి చెప్పినట్లు రాపాక పేర్కొన్నారు. అనంతరం మరో ఇద్దరు ఎమ్మెల్యేలను కూడా టీడీపీ ప్రలోభాలకు గురిచేసిన విషయం తెలిసిందన్నారు. కాగా ఈ అంశంపై ఉండి ఎమ్మెల్యే రామరాజు మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ లాబీల్లో రాపాకను కలిసిన విషయం వాస్తవమేనని అంగీకరించారు. అయితే రాపాకను ప్రలోభపెట్టలేదంటూ దాటవేసే యత్నం చేశారు.

ప్రలోభాలకు ఆదిగురువు

రాజకీయాల్లో ప్రలోభాల పర్వం చంద్రబాబుతోనే మొదలైందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న ఎన్టీఆర్‌కు 1995లో వెన్నుపోటు పొడిచి టీడీపీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేసి చంద్రబాబు అధికారం చేజిక్కించుకున్న వైనాన్ని గుర్తుచేస్తున్నారు. ఇక రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ శాసన మండలికి 2015లో ఎమ్మెల్యేల కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంఖ్యాబలం లేకపోయినా టీడీపీ అభ్యర్థి వేం నరేంద్రరెడ్డిని చంద్రబాబు బరిలోకి దించారు. రూ.కోట్లు ఎర వేసి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు తన శిష్యుడు రేవంత్‌రెడ్డిని పురమాయించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు డబ్బుల కట్టలతో కూడిన బ్యాగ్‌ను అందచేస్తుండగా తెలంగాణ ఏసీబీ సాక్ష్యాధారాలతో రెడ్ హ్యాండెడ్‌గా 2015 మే 31న పట్టుకుంది. ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు రాష్ట్ర ప్రయోజనాలను తెలంగాణ సర్కార్‌కు తాకట్టుపెట్టి మరీ రాత్రికి రాత్రే చంద్రబాబు హైదరాబాద్ నుంచి పరారై కృష్ణా కరకట్టపై ఉండవల్లి వద్ద ఉన్న అక్రమ నివాసానికి చేరుకున్నారు. తాజాగా శాసనమండలికి ఎమ్మెల్యేల కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇదే రీతిలో ఓటుకు నోట్లు కుంభకోణానికి చంద్రబాబు పాల్పడటం గమనార్హం.

స.హ. చట్టంపై అవగాహన కల్పించాలి

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్

సైదాబాద్: సమాచార హక్కు చట్టంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం సైదాబాద్‌లో సమాచార హక్కు పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో పాశుపతాస్త్రంలా పనిచేస్తుందన్నారు. ప్రభుత్వాలు రూ.కోట్ల వ్యయంతో చేపట్టే వివిధ పథకాల అమలు సక్రమంగా సాగేందుకు, నిధులు దుర్వినియోగం కాకుండా చూసేందుకు అందరికీ సహ చట్టం ద్వారా సమాచారం తెలుసుకునే హక్కు ఉందని వివరించారు. సమాచార హక్కు చట్టం మాజీ చీఫ్ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాచారం దాచిపెడితే ఎన్నో అనుమానాలు వస్తాయని, వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచితే అపోహలకు తావు లేకుండా పారదర్శకంగా ఉంటుందన్నారు. సమితి సభ్యులు క్షేత్రస్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని కోరారు. ఎస్‌హెచ్‌పీఎస్ జాతీయ చైర్మన్ బి.కేశవులు మాట్లాడుతూ సహ చట్టం సామాన్యుడి దరికి చేరినప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందన్నారు. త్వరలో తెలంగాణలో అన్ని జిల్లాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు కన్నెబోయిన ఉషారాణి, గుండ్లపల్లి శ్రీనివాస్, వెంకటలక్ష్మి, సంధ్య, యాదగిరి, ఉమాకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు నూతన సంవత్సర కేలండర్‌ను బండా ప్రకాష్ ఆవిష్కరించారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్ ముదిరాజ్

జిల్లా వార్తలు

పర్యాటకులతో కిన్నెరసానిలో సందడి

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. పర్యాటకులు డీర్ పార్కులోని దుప్పులు, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడపడంతో పాటు రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు. పర్యాటకుల టికెట్ల ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.15,535, బోటుషికారు ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.11,150 ఆదాయం సమకూరింది.

బైక్‌పై దక్షిణ భారత యాత్ర..



ద్విచక్రవాహనంపై యాత్ర చేస్తున్న యశ్వంత్

అశ్వారావుపేటరూరల్: ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ రక్షణపై అవగాహన కల్పించేందుకు భువనేశ్వర్ నుంచి ఓ యువకుడు ద్విచక్రవాహనంపై దక్షిణ భారత యాత్ర చేపట్టాడు. ఈ యాత్ర ఆదివారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పేరాయిగూడెం వద్దకు చేరుకుంది. ఒడిశాకు చెందిన ఆశ్వత్ యశ్వంత్ ద్విచక్రవాహనంపై భువనేశ్వర్ నుంచి ఈనెల 19న యాత్రకు బయలుదేరాడు. ఏపీ, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర మీదుగా తిరిగి ఒడిశాకు చేరుకుంటానని ఆయన తెలిపాడు. యాత్రలో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తూనే... ప్రజల్లో భక్తిభావం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణపతకం




వైయుహిత

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో అండర్–9 విభాగం నుంచి ఖమ్మం విద్యార్థిని సత్తా చాటింది. నగరంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థిని ఇనపనూరి వైయుహిత పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. ఆమెను డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, కోచ్ కె.సురేష్ తదితరులు అభినందించారు.

ఇలా చేస్తే మార్కులు మీ సొంతం..

- పక్కా ప్రణాళికతో చదువుకోండి
- ఎస్సెస్సీ విద్యార్థులకు విషయ నిపుణుల సలహాలు
- వచ్చే నెల 3నుంచి మొదలుకానున్న వార్షిక పరీక్షలు



పక్కా ప్రణాళికతో చదివి చక్కటి విషయ ప్రదర్శన చేయగలిగితే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చు. వచ్చే నెల 3వ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మొదలుకానున్న నేపథ్యాన చివరి నిమిషం వరకు ఏయే విషయాలపై దృష్టి సారించాలనే విషయంపై సబ్జెక్టుల వారీగా నిపుణులు తమ సూచనలు, సలహాలు అందజేశారు. ఈ ఏడాది పరీక్షా పత్రం రూపురేఖలు మార్చిన నేపథ్యాన చాయిస్ తక్కువగా ఉండటంతో పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, పది జీపీఏ ఎలా సాధించవచ్చనే అంశంపై పలువురు సీనియర్ ఉపాధ్యాయులు ఇచ్చిన సలహాలు, సూచనలు ఇలా ఉన్నాయి.

– కొణిజర్ల

గణితం: అర్థం చేసుకుంటే సులువు



గణితంలో మంచి మార్కుల కోసం 14 చాప్టర్లపై పట్టు సాధించాలి. ప్రభుత్వం ఇచ్చిన అభ్యాస దీపికలోని నమూనా ప్రశ్నలు సాధన చేస్తే మంచి మార్కులు సాధించొచ్చు. గ్రాఫ్ సమస్యలు సాధించేటప్పుడు తప్పక స్కేల్, సాధన రాయాలి. నిర్మాణ పటం గీసేటప్పుడు నిర్మాణ క్రమం, నిర్ధారణ కూడా రాయాలి. వాస్తవ సంఖ్యల్లో లాగరిథమ్స్, సమితుల లో వెన్ చిత్రాలు, సెట్ బిల్డర్ ఫామ్, రోస్టర్‌ఫామ్ రాయడం, బహుపదుల్లో పరావలయం గీయడం, సంభావ్యత, సంఖ్యాక శాస్త్రంలో మీన్, మీడియన్, మోడ్ లెక్కలతో పాటు ఓజివ్ గ్రాఫ్‌లే కాక, సరూప త్రిభుజాల నిర్మాణాలు, వృత్తానికి స్పర్శరేఖలు గీయడం, త్రికోణమితి అనువర్తనాలు నుంచి బొమ్మ గీయడం ప్రాక్టీస్ చేయాలి. కీలకాంశాలను ప్రతిరోజూ రాసుకోవడం వల్ల గుర్తుపెట్టుకోవచ్చు. గణితంపై భయపడకుండా సాధన చేసి గుర్తు ఉన్నవరకు జవాబులు రాస్తే మంచి మార్కులు సొంతమవుతాయి.

– తేరాల ఉపేంద్రయ్య, ఎస్‌ఏ, గణితం, జెడ్పీహెచ్‌ఎస్, కేజీ సిరిపురం, వైరా మండలం

సోషల్: పట్టికలు, గ్రాఫ్‌లు కచ్చితం



విద్యార్థులు అన్ని ప్రశ్నలను ఒకేతీరుగా కాకుండా అడిగిన విధానాన్ని బట్టి సమాధానం రాయాలి. వ్యాసరూప సమాధాన ప్రశ్నల్లో కారణాలు, పోలికలు, బేధాలు, ఫలితాలు, ప్రభావితం చేసే అంశాలను వర్గీకరించడం, ఉదాహరణలతో వివరించడం తప్పనిసరి. పట్టికలు , గ్రాఫ్‌లు, పై చార్ట్ ప్రశ్నలు కచ్చితంగా అడిగే అవకాశం ఉంది. ఇచ్చిన డేటా ఆధారంగా విశ్లేషణ చేయడంతో పాటు కారణాలు, ఉదాహరణలు, ఫలితాలే కాక సూచనలు, పరిష్కార మార్గాలు రాస్తే మంచి మార్కులు ఖాయం. తెలంగాణ, భారతదేశం ఔట్‌లైన్ మ్యాపులు గీయడమే కాక వివిధ రాష్ట్రాలు, వాటి రాజధానులు, పర్వతాలు, నదులు, పీఠభూములు, ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న దేశాల రాజధానులు, అంతర్జాతీయ సంస్థల కేంద్ర స్థానాలపై దృష్టిపెట్టాలి. వీటికి తోడు కరపత్రాలు, నినాదాలు, లేఖలు, ప్రపంచ శాంతి, బాలికా విద్య, సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత, గాంధీ, అంబేడ్కర్, సుభాష్‌చంద్రబోస్ వంటి నాయకుల నుంచి నేర్చుకున్న విషయాలపై ఎక్కువగా అడిగే అస్కారం ఉంది. పార్ట్–బీ బిట్ పేపర్‌లో సాంఘికశాస్త్రం ఫోరం నిర్వహించిన టాలెంట్ టెస్టు పేపర్లు, ప్రభుత్వం ఇచ్చిన అభ్యాస దీపికలు చదివితే ఎక్కువ మార్కులు సాధించొచ్చు.

– తుంగతుర్తి సుబ్బారావు, ఎస్‌ఏ, సోషల్ స్టడీస్, జెడ్పీహెచ్‌ఎస్, కామంచికల్, రఘునాథపాలెం మండలం

తెలుగు: భాషపై పట్టు తప్పనిసరి



తెలుగులో 80 మార్కులకు 20 మార్కులు అవగాహన ప్రతిస్పందన నుంచి పొందొచ్చు, దానశీలం, భిక్ష పాఠాల నుంచి చుక్క గుర్తు పద్యాల్లో ఒకటి తప్పక అడిగే అవకాశముంది. ఆధునిక పద్య పాఠాలు వీర తెలంగాణ, శతక పద్యాల నుంచి ఒకటి వస్తుంది. అపరిచిత గద్యం ప్రతీ ప్రశ్నకు రెండు మార్కులు ఉన్నందున అర్థం చేసుకుని 1 లేదా 2 మాటల్లో జవాబు రాయాలి. స్వీయ రచన, సృజనాత్మకత, వ్యక్తీకరణ చిన్న ప్రశ్నల్లో ఒక కవి పరిచయం అడుగుతారు. ఇదే విభాగంలో ఏదైనా ఒక శతక సారాంశం లేదా భావం ప్రశ్న అడుగుతారు. వ్యాసరూప ప్రశ్నలకు రామాయణంపై పట్టు ఉంటే మంచి మార్కులు సాధించొచ్చు. సృజనాత్మక రచనల విభాగంలో పాఠ్యాంశాల ప్రధాన భావనలు ఆధారంగా సంభాషణ, కరపత్రం, గేయం, కవిత, నినాదాలు, సూక్తులు, ప్రశ్నావళి అడనున్నందున దృష్టి సారించాలి. పాఠాల భావం ఆధారంగా అవగాహన, నేర్చుకున్న అంశాలను గుర్తించడం, సమర్థన, కవి ఉద్దేశాలను సొంత మాటల్లో చెప్పేలా రాసేందుకు అభ్యసనం చేయాలి.

– జీడీఎస్‌వీ.రమణ, గ్రేడ్–1, తెలుగు పండితులు, జెడ్పీహెచ్‌ఎస్, పెద్దగోపతి, కొణిజర్ల మండలం

ఫిజిక్స్: ప్రణాళికా ప్రధానం



ఫిజిక్స్, బయాలజీ కలిపి ఒకేరోజు పరీక్ష రాయాల్సి ఉన్నందున ముఖ్యమైన విషయాలు గుర్తు పెట్టుకుంటే మంచి మార్కులు సాధించవచ్చు. ప్రయోగాలకు 9 మార్కులు కేటాయించారు. రెండు మార్కుల ప్రశ్నలుగా ప్రయోగ సామగ్రి పరిశీలన, ఫలితాల్లో ఒకటి అడుగుతారు. ఆరు మార్కుల ప్రశ్నల్లో ఒక ప్రయోగ విధానం తప్పనిసరిగా వస్తుంది. పీ ఆర్బిటాల్ ఆకృతులు, ప్రయోగ అమరికలు చూపే పటాలు, కిరణ చిత్రాలు, అణువులు ఆకృతి నేర్చుకోవాలి. పట్టిక లేదా ఇతర రూపంలో ఇచ్చే ప్రశ్నల్లో పదార్థం, పీహెచ్, దృష్టి దోషాలు, క్వాంటమ్ సంఖ్యలు, ఆవర్తన పట్టిక, హైడ్రోకార్బన్ ధర్మాలు వంటి అంశాలపై వివరాలు, పటాలు గుర్తుంచుకోవాలి. విషయ అవగాహనలో 18 మార్కులకు వచ్చే ప్రశ్నల్లో బ్లీచింగ్ పౌడర్, వాషింగ్ సోడా ఉపయోగాలు, కుంభాకార పుటాకార దర్పణాల బేధాలు, ఆవర్తనపట్టిక లక్షణాలు వంటివి చదవాలి.

– తాళ్లూరి చంద్రశేఖర్‌రావు, ఎస్‌ఏ, ఫిజిక్స్, జెడ్పీహెచ్‌ఎస్, తిరుమలాయపాలెం

హిందీ: ప్రయత్నిస్తే విజయమే



హిందీపై పట్టు సాధించి, భాషా జ్ఞానాన్ని పెంచుకుంటే అపజయం ఉండదు. పఠిత గద్యాంశం పుస్తకంలోని నాలుగు ఉపవాచక పాఠాల నుంచే ప్రశ్నలు అడుగుతారు. పఠిత పద్యం 1,3, 4(బరసతే బాదల్, మా ముఝే అనేదే, కణ్‌కణ్‌కా అధికారీ) పాఠాల నుంచి ఒక పద్యం ఇచ్చి ఐదు ప్రశ్నలు వేస్తారు. పద్యాల భావం క్షుణ్ణంగా నేర్చుకుంటే మంచి మార్కులు వస్తాయి. రెండో విభాగం నాలుగు మార్కుల ప్రశ్నల్లో ఒకటిగా ఉండే కవి పరిచయం కోసం చరిత్రలు నేర్చుకోవాలి. ఎనిమిది మార్కుల ప్రశ్నలు పద్యభాగం, గద్య భాగం నుంచి రెండేసి అడుగుతారు. ఇదే విభాగంలో సృజనాత్మకత విషయంలో లేఖ, సాక్షాత్కార్, బాత్ చీత్, నారే, విజ్ఞాపన్, కరపత్ర్ వ్యాసాల్లో రెండు అడిగితే ఒకటి రాయాలి. బిట్‌పేపర్‌లో 20 మార్కులకు 10 మార్కులు భాషా కీ బాత్ పాఠాల వెనక గ్రామర్ పాయింట్లు, మరో 10 మార్కులు వ్యాకరణాంశాలపై అడగొచ్చు.

– మహ్మద్ షఫీ, గ్రేడ్–1 హిందీ పండిట్ – ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వైరా


జీవశాస్త్రం: బొమ్మలే ఆయువుపట్టు



సామాన్య శాస్త్రం రెండు పేపర్లు ఉండగా పార్ట్ బీ పరీక్షగా జీవశాస్త్రంలో గంటన్నర సమయాన 40 మార్కుల ప్రశ్నాపత్రానికి సమాధానాలు రాయాలి. హైడ్రిల్లా ప్రయోగం, Co_2 అవసరం, కిరణజన్య సంయోగ క్రియకు కాంతి అవసరం, శ్వాసక్రియలో Co_2, ఉష్ణం విడుదలవుతుందని చూపే ప్రయోగాలు నేర్చుకుంటే ఎనిమిది మార్కులు సొంతమవుతాయి. ఇక మానవుని జీర్ణవ్యవస్థ, ఏక వలయ, ద్వివలయ రక్త ప్రసరణ, మూత్ర పిండాల అంతర్నిర్మాణం బొమ్మలను నేర్చుకుంటే ఆరు మార్కులు సాధించొచ్చు. స్వయం పోషకాలు, పరపోషకాలు బేధాలు, కిరణజన్య సంయోగక్రియ – శ్వాసక్రియ బేధాలు, కాంతి చర్య – నిష్కాంతి చర్య, అలైంగిక ప్రత్యుత్పత్తి – లైంగిక ప్రత్యుత్పత్తి, సమవిభజన– క్షయకరణ విభజన, మెండల ప్రతిపాదన సూత్రాలు, పర్యావరణ సంరక్షణ నాలుగు Rలపై పట్టు పెంచుకుంటే ఈ విభాగంలో 18 మార్కులు సాధించొచ్చు.

– జక్కుల యాకూబ్, ఎస్‌ఏ, బయాలజీ, జెడ్పీహెచ్‌ఎస్, గరికపాడు, వైరా మండలం

ఆంగ్లం: భయం వీడితే మంచి మార్కులు



ఆంగ్లమనే భయం విడనాడితే విద్యార్థులు మంచి మార్కులు సాధించవచ్చని ఆంగ్ల ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ప్రశ్నాపత్రంలో 1 నుంచి 4, 5 నుంచి 8 ప్రశ్నలు రీడింగ్ విభాగంలో పాఠ్యపుస్తకం నుంచి ఇచ్చే ప్యాసేజ్ చక్కగా చదివాక ప్రతీ ప్రశ్నకు మూడు వాక్యాల సమాధానం రాయాలి. Why do you think, What do you think, How would you respond, What would you do వంటి ప్రశ్నలు అడిగితే if i were, ...I WOULD వంటి వాక్యంతో సమాధానాలు మొదలుపెడితే మంచిది. WHY అనే ప్రశ్నతో ఉన్న ప్రశ్నకు BECAUSEతో సమాధానం రాయాలి. కాంప్రహెన్సివ్ ప్యాసేజ్‌ల్లో ఈ ఏడాది కొత్తగా స్టడీ స్కిల్స్ అంశం చేర్చారు. pie chart, bar graph, tree diagram, Flow chart ఇస్తారు. ప్రశ్న ఆధారంగా ఆలోచించి సమాధానం రాయాలి. సృజనాత్మక వ్యక్తీకరణ విభాగంలో విద్యార్థుల స్కిల్స్ పరిశీలించి మార్కులు వేస్తారు. major discourseల్లో కనీసం 4 నుంచి 6 పేరా గ్రాఫ్‌లు రాయాలి. పోస్టర్, ఇన్విటేషన్, ప్రొఫైల్, నోటీస్, మెసేజ్, డైరీ ఎంట్రీ అంశాలపై అడిగే ప్రశ్నకు ఒక పేజీలోనే రాయాలి. ఇక పార్ట్–బీలో 20 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ప్యాసేజ్, పోయంలో ఒకటి ఇస్తుండగా, పూర్తిగా అర్థంచేసుకుని అడిగిన ప్రశ్నలకు సమాధానం రాయాలి. ఎడిటింగ్ ప్రశ్నలు, వ్యాకరణాంశాలు, పాఠ్య పుస్తకం ఆధారంగా vocobulary based ప్రశ్నలు ఉంటాయి. పాఠ్యపుస్తకం క్షుణ్ణంగా చదివితే మంచి సమాధానాలు రాయొచ్చు.

– సంక్రాంతి రవికుమార్, ఎస్‌ఏ, ఇంగ్లిష్, జెడ్పీహెచ్‌ఎస్, కూసుమంచి